# మిర్చి రైతులు లబోదిబో..

- ఈ ఏడాది తెగుళ్లు, చీడపీడలతో దెబ్బతిన్న పంటలు
- దిగుబడి లేదు.. అప్పులు మిగిలాయి..
- భారీగా పడిపోయిన ఎర్రబంగారం ధరలు
- అన్నదాతలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం


మిర్చిని కల్లంలో ఆరబెట్టి తాలుమిరపకాయలను ఏరుతున్న రైతులు

కరకగూడెం, మార్చి 16 : మిరప పంట రైతన్నల కంట్లో కారం కొట్టింది. ఈ ఏడాది మిర్చి రైతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గతేడాదితో పోలిస్తే దిగుబడి గణనీయంగా తగ్గింది. ధర కూడా సగానికి సగం తగ్గిపోయింది. గతేడాది ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్లు దిగుబడి వస్తే, ఈ ఏడాది మిర్చికి వైరస్‌తోపాటు చీడపీడలు సోకి 10 క్వింటాలకు మించి దిగుబడి రాలేదు. ప్రభుత్వం మిర్చి పంటకు రూ.10 వేలకు మించి మద్దతు ధర అందించకపోవడంతో రైతులు మిర్చి పంటను మార్కెట్‌కు తరలించడానికి కూడా వెనకాడుతున్నారు. కొంతమంది రైతులు పండించిన మిర్చిని తెంపడానికి కూడా కూలీ డబ్బులు లేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఎన్నో ఆశలతో మిరప పంట సాగు చేయగా చీడపీడలు ఆశించి దిగుబడులపై దెబ్బకొట్టాయి. వేలకు వేలు అప్పులు తెచ్చి పురుగుమందులు పిచికారీ చేసినా కనీసం పెట్టుబడులు కూడా చేతికి అందకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

### వైరస్‌లతో రైతులు సతమతం

ఈ ఏడాది వాతావరణం అనుకూలించక అనేక రకాల చీడపీడలు వైరస్ రూపంలో మిర్చి పంటలను నాశనం చేశాయి. తెగుళ్ల బారి నుంచి పంటలను కాపాడుకోవడానికి పురుగుమందులను ఎక్కువ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో సిరులు కురిపించిన ఎర్ర బంగారం ఈ ఏడాది కనీస మద్దతు ధరలేక రైతులను అప్పుల పాలు చేస్తుంది. ఎకరాకు సమారు రూ.లక్ష యాభై వేలపైనే పెట్టుబడులు పెట్టినా కనీసం కూలీలు, పెట్టుబడులకు కూడా రాక రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మిర్చి క్వింటాకు మార్కెట్ ధర రూ.10 వేలకు మించి ఉండకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

### ఆదుకోని ప్రభుత్వం

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు సకాలంలో రైతు బంధు సాయం ఎకరాకు రూ. 10 వేలు అందించేది. రైతువేదికల ద్వారా సకాలంలో రైతులకు సలహాలు సూచనలు ఇచ్చేది. ప్రకృతి వైపరిత్యాల వల్ల నష్టపోతే పరిహారం అందజేసి రైతులను ఆదుకునేది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పేరిట రైతులకు పెట్టుబడి సాయం గత రెండు సీజన్లు అందిచకపోవడంతో రైతులకు పెట్టుబడి నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికీ రైతులకు రైతుభరోసా నిధులు 3 ఎకరాలకు మించి అందలేదు. రైతుభరోసా నిధుల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన ప్రభుత్వం చేస్తుండటంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

### బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు స్వర్ణయుగం

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మిర్చి పైరు రకం బట్టి క్వింటాకు రూ.18 వేల నుంచి 35 వేల వరకు ధర పలికినట్లు రైతులు చెబుతున్నారు. కేసీఆర్ హయాంలో మిర్చి రైతులకు రికార్డు ధరలు లభించాయి. అంతకుముందెన్నడూ లేనివిధంగా బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు స్వర్ణయుగమని పలువురు రైతులు గుర్తుచేసుకుంటున్నారు. సకాలంలో రైతులకు పెట్టుబడి సాయం, ఎరువులు, విత్తనాలు అందడంతో వ్యవసాయాన్ని పండగలా చేశారని కర్షకులు, వ్యవసాయ నిపుణులు చర్చించుకుంటున్నారు.

### ధర లేక పంట నిల్వ ఉంచా..



ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి పంటకు ధరలు లేకపోవడంతో పొలంలో నిల్వ ఉంచా. దీంతో కూలీలకు కూలీ డబ్బులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాం. గతేడాది కంటే ఈ ఏడాది అధికంగా తెగుళ్లు సోకి పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. మార్కెట్‌లో కూడా ఆశించిన స్థాయిలో ధర లభించడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

**– చప్పిడి వెంకటేశ్వర్లు, రైతు, చొప్పాల గ్రామం,కరకగూడెం మండలం**

### ఏం చేయాలో తోచడంలేదు..



ఆరుగాలం ఇంటిల్లిపాది కష్టపడి పండించిన మిర్చికి నల్లి కుళ్లు సోకి దిగుబడులు పడిపోయాయి. కనీసం మద్దతు ధర అయినా ఉంటుందా అంటే ప్రభుత్వం ఘోరంగా క్వింటాకు రూ.10 వేలు మించి కొనడం లేదు. ఆ ధరకు అమ్మితే కనీసం కూలీ ఖర్చులు కూడా రాని పరిస్థితులున్నాయి. ఇలాంటి పరిస్థితులల్లో ఏంచేయాలో అర్థంకావడం లేదు. ప్రభుత్వం క్వింటాకు రూ. 20 వేలు మద్ధతు ధర ప్రకటించాలి. అప్పుడు లాభాలు రాకపోయిన కనీసం పెటుబడులైనా వస్తాయి. లేకుంటే రైతులు రోడ్డున పడటం ఖాయం.

**– పోగుల ఎల్లగౌడ్, రైతు, భట్టుపల్లి గ్రామం, కరకగూడెం మండలం**

### వైరస్ సోకి నష్టాలొస్తున్నాయి



మిర్చి పంటకు ఏటా కొత్త రోగాలు వస్తున్నాయి. లక్షలు పెట్టుబడి పెట్టాం. ఈ ఏడాది పంట బాగుంటుందని అనుకున్న తరుణంలో వాతావరణం అనుకూలించక పంట దిగుబడి ఎకరాకు 10 క్వింటాలు మించ లేదు. దిగుబడి అరకొర రావడంతో అప్పులు మిగిలాయి. వైరస్‌తో పంట చాలా వరకు దెబ్బతింది. వచ్చిన పంటకు కూడా గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**– నర్సింహారావు, రైతు, చిలకలసింగారం గ్రామం, కరకగూడెం మండలం**

# బాబోయ్ 'దొంగలు'!

- ఖమ్మం అర్బన్‌లో రెచ్చిపోతున్న చోరులు
- తాళం వేసిఉన్న ఇళ్లే టార్గెట్
- సీసీ కెమెరాలు ఉన్నా యథేచ్ఛగా చోరీలు

**నెత్తికి రుమాలు చుట్టుకొని, చేతిలో కత్తి పట్టుకుని, ముఖానికి నలుపురంగు పూసుకొని వచ్చి చోరీలు చేయడం పాతకాలపు మాట. ఇప్పుడు ట్రెండ్ మారింది. అంతా క్లాసే. దొంగతనాన్ని దొరతనంలా చేయడం వృత్తిగా మార్చుకున్నారు. తెలివిగా దొంగతనాలు చేస్తూ వేలిముద్రల జాడ కూడా దొరక్కుండా జాగ్రత్త పడుతున్నారు. కనీసం క్లూస్ టీమ్‌కు కూడా ఆధారాలు లభించకుండా తప్పించుకుపోతున్నారు. కొద్దిరోజులుగా ఖమ్మం అర్బన్‌లో జరుగుతున్న వరుస దొంగతనాలే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా ఉన్నాయి.**

**- రఘునాథపాలెం, మార్చి 16**


పాండురంగాపురంలోని కిరాణం షాపులో చోరీకి పాల్పడుతున్న దొంగ (సీసీపుటేజ్)

ఇప్పటికే ఖమ్మం అర్బన్ స్టేషన్ పరిధిలో జరిగిన దొంతనాలకు అభయం లేకుండా పోతోంది. కొద్దిరోజులుగా స్టేషన్ పరిధిలో దొంగలు రెచ్చిపోతున్నారు. నయాపోకడలను అనుసరిస్తూ అంతుచిక్కని రీతిలో దోచుకుంటున్నారు. దోచుకున్నది దాచుకుంటూ మళ్లీ మళ్లీ చోరీలకు పాల్పడుతూ పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. రాత్రీ పగలూ అనే తేడా లేకుండా ఇళ్లూగుళ్లల్లోకి చొరబడి నూతన టెక్నాలజీని ఉపయోగించుకుంటూ అందినకాడికి దండుకొని పారిపోతున్నారు.

గత నెల 28న ఖమ్మం 11వ డివిజన్ మధురానగర్‌కు చెందిన రిటైర్డ్ హెచ్ఎం చల్లా శ్రీనివాసరావు నివాసం ఉండే అపార్ట్‌మెంట్‌లోని ఇంట్లోకి ప్రవేశించిన దొంగ.. రూ.28 లక్షల నగదు, కొంత బంగారంతో ఉడాయించాడు. శ్రీనివాసరావు గత నెల తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లోని తన కుమార్తె ఇంటికి వెళ్లిన సమయంలో ఈ చోరీ జరిగింది. చోరుడు నెత్తికి టోపీ, ముఖానికి మాస్క్ పెట్టుకొని వచ్చి ఇంట్లోకి వచ్చాడు. గునపంతో లాకర్‌ను పగులకొట్టి నగదు, బంగారం ఎత్తుకెళ్లాడు. తాజాగా మంగళవారం రాత్రి 4వ డివిజన్ ఇల్లెందు ప్రధాన రహదారి పాండురంగాపురంలో యాదా వెంకటేశ్వర్లుకి చెందిన కిరాణం షాపు షట్టర్‌ను పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగ.. కౌంటర్‌లోని నగదును, విలువైన సరుకులను ఎత్తుకెళ్లాడు. అంతే కాదు, ఇటీవల పాండురంగాపురంలో ప్రభుత్వ పాఠశాల వెనుక నివాసం ఉండే హనుమంతరావు ఇంట్లో, 1వ డివిజన్ కేఆర్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలోని ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో, ఎనిమిది నెలల క్రితం కైకొండాయిగూడెం రోడ్డులోని అంకమ్మ తల్లి దేవాలయంలో ఇదే తరహా దొంగతనాలు జరిగాయి. ఈ చోరీ జరిగిన అన్ని ప్రదేశాల్లోనూ సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ చోరులు తమ కానిచ్చి నగదు, ఆభరణాలతో ఉడాయించారు. చోరీ జరిగిన వీడియోలు సీసీ పుటేజీల్లో లభించినా చోరులజాడను నేటికీ గుర్తించలేదు. కొద్దిరోజులుగా స్టేషన్ పరిధిలో చోరీ జరిగిందని సమాచారం తెలిస్తే చాలు.. పోలీసుల గుండెలు జారిపోతున్నట్లుగా తెలుస్తోంది. చోరీ జరిగిన తీరును పరిశీలించినా చోరుడి చిరునామా లభించక అయోమయానికి గురవుతున్నారు. రెండేళ్ల కాలంలో ఖమ్మం అర్బన్ పరిధిలో జరిగిన చోరీలకు అతీగతి లేకుండా పోయింది. ఫలితంగా చోరీకి గురైన బాధితులకు భరోసా కరువైంది. శాంతిభద్రతలకు రక్షణ కరువై.. చోరులు దోచుకున్న సొమ్మును మరిచిపోవాల్సిన ఘటనలు దాపురించాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు, స్టేషన్ పరిధిలో అంతుచిక్కని గొలుసు దొంగతనాలూ అనేకం ఉన్నాయి.

## జిల్లా న్యాయసేవ సంస్థ సభ్యుడిగా మందడపు


మందడపు శ్రీనివాసరావు

వైరాటౌన్, మార్చి16: ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులుగా సీనియర్ న్యాయవాదులు మందడపు శ్రీనివాసరావు, పి.సంధ్యారాణి, సామాజిక కార్యకర్త డాక్టర్ డి.పూర్ణచంద్రరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా న్యాయ సేవా సంస్థ అధ్యక్షులుగా జిల్లా జడ్జి ఉండగా కలెక్టర్, కమిషనర్ ఆఫ్ పోలీస్ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ప్రభుత్వ న్యాయవాదులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా కొనసాగుతారు. వీరితో పాటు ప్రముఖ సామాజిక కార్యకర్త, ప్రముఖ న్యాయవాది, న్యాయ సేవా సంస్థల కార్యకలాపాలపై ఆసక్తి ఉన్న ప్రముఖులను సభ్యులుగా నియమిస్తారు. ఈ కేటగిరీల్లోని ప్రస్తుతం సభ్యులను రాష్ట్ర హైకోర్టు సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వీరు రెండు సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమావేశాల్లో వీరు జిల్లా జడ్జి, కలెక్టర్ ఎస్పీలతో పాటు సభ్యులుగా పాల్గొంటారు.

## సేవాలాల్ గద్దెను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**మాజీ ఎమ్మెల్సీ సపావత్ రాములునాయక్**

కారేపల్లి, మార్చి 16: మండల కేంద్రంలో గిరిజన బంజారాలు నిర్మించిన సేవాలాల్ గద్దెను కూల్చివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ సపావత్ రాములు నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా బంజారా గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో సేవాలాల్ జయంతి నిర్వహిస్తూ వస్తున్నారన్నారు. ఈఏడాది స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం పక్కన గల ప్రభుత్వ స్థలంలో సేవాలాల్ వేడుక నిర్వహించగా అక్కడ నిర్మించిన దిమ్మెను కూల్చివేయడం బాధాకరమన్నారు. బంజారా జాతికి జరిగిన అవమానానికి కారకులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బానోత్ రామ్మూర్తి, ధరావత్ భద్రూ నాయక్, వాంకుడోత్ గోపాల్, బీముడు నాయక్, నాయకులు అడ్డగోడ ఐలయ్య, తోటకూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో మిర్చి రైతుల సమస్యలపై చర్చించాలి

**తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు**


మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరాటౌన్, మార్చి 16: మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో చర్చ చేయాలని, అందుకు ఖమ్మం జిల్లా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మిర్చి క్వింటాకు రూ.25 వేలు మద్దతు ధర నిర్ణయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కొనుగోలు చేయాలని, ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని, ఉభయ సభల్లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు రైతు సంఘాల ఆధ్వర్యంలో మిర్చి రైతులు సమస్యలపై వినతిపత్రాలు అందించామని అన్నారు. మిర్చి ఎగుమతులు ద్వారా ఇప్పటివరకు విదేశీ మారక ద్రవ్యం పొందిన కేంద్ర ప్రభుత్వం కష్టంలో ఉన్న మిర్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు, రైతుల సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమం ఉధృతం చేస్తామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

# ఇకపై అప్పులు చేయను!

- ఆదాయం పెంచి, పంచుతా
- అప్పు చేసి తినే పప్పు కూడుతో రాష్ట్రానికి ముప్పు
- అప్పుల వల్లే పథకాలు అమలు చేయలేకపోతున్నా
- స్టేషన్ ఘన్‌పూర్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే రికార్డుస్థాయిలో రూ.1.53 లక్షల కోట్లు అప్పులు చేసి, తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇకపై తాను అప్పులు చేయదలుచుకోలేదని స్టేషన్ ఘన్‌పూర్ సభ సాక్షిగా స్పష్టంచేశారు. అప్పుచేసి తినే పప్పు కూడు, అప్పు ఎప్పటికైనా రాష్ట్రానికి ముప్పేనని తాను స్పష్టంగా నిర్ణయించుకున్నట్టు వివరించారు. ఇకపై అప్పులు చేయబోనని, రాష్ట్ర ఆదాయం పెంచి, పేదలకు పంచుతానని పేర్కొన్నారు. అందరూ సహకరించాలని కోరారు.

### 2 లక్షల మాఫీ అందరికీ చేయలే...

రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించారు. గత ప్రభుత్వం అప్పులు చేయడం మూలంగా 15 నెలల పాలనలో రూ.1.53 లక్షల కోట్లు అసలు, మిత్తి చెల్లించామని ఆరోపించారు. ఆ మొత్తం నిధులు ఉంటే అర్హులైన 30 లక్షల మందికి రూ.5 లక్షల చొప్పున ఇచ్చి ఇండ్లను కట్టించేవాడినని స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆదివారం జరిగిన బహిరంగ సభలో సీఎం పేర్కొన్నారు. 75 లక్షల మంది రైతులకు రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేసేవాడినని చెప్పారు. తాజా అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంలో, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటల్లోనూ రూ.2 లక్షల రుణమాఫీ పూర్తయిందని స్పష్టం చేసిన విషయం విదితమే.

### ఆర్థిక నిపుణుల విస్మయం

సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆర్థిక నిపుణులు, రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి మించి నెలకు రూ.10 వేల కోట్ల చొప్పున, ఈ 15 నెలల్లో రూ.1.53 లక్షల కోట్లు అప్పులు చేయడమే కాకుండా నీతులు వల్లించడం ఏమిటని చెప్తున్నారు. ఎన్నికలకు ముందు అప్పులపై నానా యాగీ చేసి, నేడు అప్పుల కోసం వెంపర్లాడంపై విమర్శలు చేస్తున్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ హయాంలో తీసుకొచ్చిన అప్పులన్నీ అసలు, మిత్తిలకే కట్టామని అబద్ధాలు చెప్పడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గత బీఆర్ఎస్ సర్కారుపై అభాండాలు వేయడం సరికాదని హితవు పలుకుతున్నారు. ఆర్బీఐ డాటాను వారు గుర్తుచేస్తున్నారు.

## ఈసారి రూ.లక్షన్నర కోట్ల అప్పు?

- ప్రభుత్వ బడ్జెట్ రుణాలు రూ.80 వేల కోట్లు
- రూ.40 వేల కోట్ల బడ్జెటేతర రుణాలు తీసుకునే ప్లాన్
- భూముల తనఖాతో 30 వేల కోట్లు సమీకరణకు ప్లాన్

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): 'మా ప్రభుత్వం ఇకపై అప్పులు చేయదలుచుకోలేదు' అని ఆదివారం వరంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినప్పటికీ అవన్నీ ఒట్టి మాటలేనని ఆర్థిక నిపుణులు కొట్టిపారేస్తున్నారు. సీఎం చేస్తున్న వ్యాఖ్యలకు, బడ్జెట్‌లో ప్రభుత్వ ప్రణాళికలకు సంబంధమే లేదని స్పష్టం చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు రూ.3.15 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే లీకులు ఇచ్చింది. ఇది నిరుటి బడ్జెట్ కంటే దాదాపు రూ.24 వేల కోట్లు ఎక్కువ. సాధారణంగా రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో సొంత పన్నులు, కేంద్ర పన్నుల్లో వాటా, పన్నేతర ఆదాయం బడ్జెట్‌లో ప్రధానాంశాలుగా ఉంటాయి. వీటితోపాటు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో తీసుకునే రుణాలను కలిపి రాష్ట్ర వార్షిక బడ్జెట్ అంచనాలను రూపొందిస్తారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రుణాలు కాకుండా రెవెన్యూ రాబడులను రూ.2.21 లక్షల కోట్లుగా అంచనా వేశారు.

### రూ.2 లక్షలలోపే బడ్జెట్ పెడతారా?

రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేయదలుచుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్న మాట నిజమే అయితే రెవెన్యూ రాబడుల ఆధారంగా మాత్రమే బడ్జెట్ రూపొందించాల్సి ఉంటుంది. ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో వచ్చే రుణాలను కూడా తీసుకోకూడదు. ఈ లెక్కన 2025–26 బడ్జెట్ రూ.2 లక్షల కోట్లలోపే ఉండాలి. భూముల తనఖా, విక్రయాల ద్వారా భారీగా నిధులను రాబట్టుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. రూ.30 వేల కోట్ల వరకు సమీకరించుకోబోతున్నట్టు సమాచారం.

# ప్రగతి సభలో సీఎంకు నిరసనసెగ

- రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తుండగా ఫ్లెక్సీ ప్రదర్శించిన మహిళలు
- సాంస్కృతిక సారథి ఉద్యోగాలుఇవ్వాలని డిమాండ్
- ఫ్లెక్సీ చింపేసిన పోలీసులు
- స్టేషన్ ఘన్‌పూర్‌లో సభలో కడియంకు రేవంత్ మద్దతు
- కాంగ్రెస్ ఇన్‌చార్జి గైర్హాజరు
- సీఎం సభలో చిన్న పిల్లలతో ర్యాప్ సాంగ్ డ్యాన్సులు


స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సభలో ఫ్లెక్సీలతో నిరసన తెలుపుతున్న మహిళలు

వరంగల్, మార్చి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/జనగామ చౌరస్తా: 'ప్రజాపాలన – ప్రగతి బాట' పేరిట జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిరసన సెగ తలిగింది. మహిళా కళాకారులు తమ డిమాండ్ల సాధన కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా ఫ్లెక్సీ ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సాంస్కృతిక సారథిలో తమకు ఉద్యోగాలు ఇవ్వాలని గుర్తుచేశారు. ఆ ఫ్లెక్సీని చూసిన రేవంత్‌రెడ్డి అసహనానికి గురయ్యారు. ఫ్లెక్సీని చూశానని, ఇక దించాలని ఆదేశించారు. కళాకారులు కూర్చునేలోపు ఒక్కసారిగా పదుల సంఖ్యలో పోలీసులు వారిని చుట్టుముట్టారు. దీంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొన్నది. మహిళా కళాకారుల ఫోన్లు, ఫ్లెక్సీని పోలీసులు గుంజుకున్నారు. వారిని ఈడ్చుకుంటూ సభ నుంచి బయటికి తీసుకువెళ్లారు. కొందరు చంటి బిడ్డలతో రాగా.. ముఖ్యమంత్రి మెప్పు కోసం పోలీసులు వారితోనూ దురుసుగా ప్రవర్తించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తుచేసేందుకు ప్రయత్నిస్తే అమానుషంగా ప్రవర్తించారని కళాకారులు వాపోయారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తమకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### అసలు కాంగ్రెస్ నేతల దూరం

బీఆర్ఎస్ తరపున గెలిచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి మద్దతుగా రేవంత్‌రెడ్డి ఈ సభలో ప్రసంగించారు. స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలు కడియం శ్రీహరికి అండగా ఉండాలని కోరారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దవుతుందనే చర్చ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి విన్నపం ఉపఎన్నికలకు సంకేతమని సభకు వచ్చినవారు మాట్లాడుకున్నారు. ఈ సభకు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి సింగారపు ఇందిర హాజరు కాలేదు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్న పదేండ్లు పార్టీ కోసం పనిచేసిన ఆమె ఈ సభకు దూరంగా ఉండటంపై కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. కడియం శ్రీహరి వచ్చిన తర్వాత మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్నవారిని ఇబ్బంది పెడుతున్నారని ఇందిర ఇప్పటికే పీసీసీ, ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి పాల్గొన్న సభకు ఇందిర దూరంగా ఉండడంతో మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న ఓ వర్గం సైతం సభకు రాలేదు.

### పిల్లలతో డ్యాన్సులు..

ఈ సభలో ముఖ్యమంత్రి స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే, సీనియర్ ఐఏఎస్‌లు, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో పాఠశాల పిల్లలతో స్టేజీపై ర్యాప్ సాంగ్‌లకు డ్యాన్సులు వేయించడంపై విమర్శలు వస్తున్నాయి. మొదట సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించగా.. ఆ తర్వాత ఎండలోనూ చిన్న పిల్లలతో నృత్యం చేయించడంతో సభకు హాజరైనవారు ఆశ్చర్యపోయారు. అనంతరం పిల్లలతో ఏకంగా ర్యాప్ సాంగ్‌లకు డ్యాన్సులు చేయించారు. దాదాపు పదేండ్లు విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రభుత్వ సభలో చిన్న పిల్లలతో ఇలాంటి డ్యాన్సులు వేయించడంపై సభకు వచ్చినవారు, ముఖ్యంగా మహిళలు పెదవి విరిచారు.

### రేవంత్ అన్న..?

కాంగ్రెస్‌లో ఫిరాయించిన కడియం శ్రీహరి పరిస్థితి ఆయన సహజ వైఖరికి భిన్నంగా ఉన్నదని బహిరంగ సభకు వచ్చినవారు చర్చించుకున్నారు. కడియం శ్రీహరి ప్రసంగంలో ప్రతిసారి ముఖ్యమంత్రిని రేవంత్‌రెడ్డి అన్న అని సంబోధించారు. కడియం శ్రీహరి కంటే దాదాపు 17 ఏండ్లు చిన్న వయస్సు ఉన్న రేవంత్‌రెడ్డిని గతంలో ఎప్పుడూ లేని విధంగా అన్న, అన్న.. అని అనడం కొత్తగా ఉన్నదని... ఉప ఎన్నికలు వస్తాయనే ఆందోళనే దీనికి కారణమై ఉంటుందని సభకు వచ్చినవారు ముచ్చటించుకున్నారు.

### గులాబీలతో ఇబ్బంది..

స్టేషన్ ఘన్‌పూర్ పర్యటనలో భాగంగా బహిరంగ సభకు ముందు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. వాటి నిర్వాహకులతో మాట్లాడారు. ప్రతి స్టాల్‌లోనూ నిర్వాహకులు ముఖ్యమంత్రికి ఆత్మీయంగా వారి ఉత్పత్తులతో పాటు గులాబీ పూలను ఇచ్చారు. దీంతో రేవంత్‌రెడ్డి కొంత అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ రంగు గులాబీ కావడంతో స్టాళ్లలో పూలు తీసుకోవడానికి ఆయన ఇబ్బంది పడినట్టు ఓ ఐఏఎస్ అధికారి పక్కనున్న వారితో అనడంతో అక్కడ ఉన్నవారు నవ్వుకున్నారు.

### అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం: ఎమ్మెల్యే పల్లా

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా జనగామ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పాటు వివిధ పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన ప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం అప్రజాస్వామికమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ పిరికిపంద చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. అక్రమంగా అరెస్ట్ చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వమని గొప్పలు చెప్పుకొంటున్న కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత వస్తున్నదని, అసమర్థ పాలనపై ప్రశ్నిస్తారనే బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారని మండిపడ్డారు. సీఎం పర్యటన స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉంటే జనగామ నేతలను ఎందుకు అరెస్ట్ చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అక్రమ నిర్బంధాలతో నిరంకుశత్వాన్ని చాటుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హితవు పలికారు. ఈ మేరకు ఒక ప్రకటనలో పల్లా తెలిపారు. కాగా, జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టు


మాజీ డిప్యూటీ సీఎం రాజయ్యను గృహనిర్బంధం చేసిన పోలీసులు

సీఎం రేవంత్‌రెడ్డి జనగామ జిల్లా పర్యటన సందర్భంగా పోలీసులు ముందస్తుగా బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాజీ ఎమ్మెల్యే రాజయ్యను గృహ నిర్బంధంలో ఉంచారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో జిల్లాలో పంటలు ఎండిపోవడంతో సీఎం రేవంత్‌పై ఆగ్రహంగా ఉన్న రైతులు, నేతలు నిరసనలు తెలిపే అవకాశం ఉందన్న నిఘా వర్గాల సూచనల మేరకు శనివారం అర్ధరాత్రి నుంచి పోలీసులు అరెస్టులు మొదలుపెట్టారు. బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో పాటు బీజేపీ, సీపీఎం, టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేశారు. వారిని పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. సీఎం సభ ముగిసిన తర్వాత సాయంత్రం 4 గంటలకు విడిచిపెట్టారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు డిస్క్వాలిఫై అవుతారని, రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని మంత్రి రాజయ్య విమర్శించారు.

## లక్షన్నర కోట్ల అప్పుతో ప్రజలకు ఒరిగిందేమిటి?

- కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపాటు



హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందు ఎలాంటి ప్రణాళిక లేకుండా ఆరు గ్యారెంటీలను ప్రటించిన కాంగ్రెస్ పార్టీ.. వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే లక్షన్నర కోట్ల అప్పు చేసిందని దుయ్యబట్టారు. ఈ అప్పులతో ప్రజలకు ఒరిగిందేమిటి? రాష్ట్రంలో వచ్చిన మార్పు ఏమిటి? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓటమి నుంచి తప్పించుకునేందుకే తమిళనాడు సీఎం స్టాలిన్ రెండు నెలలుగా వితండవాదం చేస్తున్నాడని విమర్శించారు.

## రేవంత్.. ప్రజలే మీ బట్టలిప్పుతరు

- సీఎంపై ఏలేటి విమర్శలు



హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి జర్నలిస్టులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్‌రెడ్డికి బట్టలు ఊడదీసే ఫాంటసీ ఏంటో అర్థం కావడంలేదని చురకలంటించారు. అది చట్టసభలో ముఖ్యమంత్రి మాట్లాడే భాషేనా అని నిలదీశారు. "ప్రజలు మీ బట్టలు విప్పేందుకు రెడీ అయితున్నారు. ముందు దానిమీద దృష్టి పెట్టండి" అని హితవు పలికారు. బీజేఎల్పీ కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఏకపాత్రాభినయం చేస్తున్నారని విమర్శించారు. ఇది హామీల ఎగవేతల, సమాధానాల దాటవేతల ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. తాను గవర్నర్ ప్రసంగంపై ప్రశ్నిస్తే సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పకుండా దాటవేశారని, పసలేని జవాబులు చెప్పారని తీవ్రంగా మండిపడ్డారు.